క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

అయిజ: ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో చేరడానికి చివరి తేదీ ఈనెల 30 వరకు పొడగించినట్లు పాఠశాల కో ఆర్డినేటర్ రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నందిన్నె చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాలు ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. బుధవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్ పోస్టును ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలోని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం, డబ్బు రాకుండా అధికారులు గట్టి బందోబస్తుతో తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మోహన్ రెడ్డి, ఐటీబీపీ పోలీసు సిబ్బంది ఉన్నారు.

గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు



అయిజ: గొర్రెలు, మేకలకు పారుడు రోగం రాకుండా ఉండేందుకు మండలంలోని వివిధ గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది పీపీఆర్ టీకాలు వేస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలో తూంకుంటలో వెటర్నరీ సిబ్బంది గొర్రెలకు, మేకలకు టీకాలు వేశారు. మొత్తం 464 గొర్రెలకు, 25 మేకలకు టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి తెలిపారు. యజమానులు మూగజీవాలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని కోరారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

గద్వాల అర్బన్/ధరూర్: జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో బుధవారం కాంగ్రెస్ అభ్యర్థి సరిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె క్యాంపు కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అభ్యర్థి సరిత వారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ధరూర్ మండలంలోని జాంపల్లి, అల్వలపాడు గ్రామాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సరిత ప్రచారం నిర్వహించారు.

అలంపూర్ రూరల్/అయిజ/ఉండవెల్లి: మండలంలోని రాజాపురం, బైనపల్లి గ్రామాల్లో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ సతీమణి మహాలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలంపూర్ మండలంలోని జిల్లెలపాడ్, సుల్తాన్‌పూర్, ర్యాలంపాడ్ గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ సతీమణి మహాలక్ష్మి, కుమార్తె దీపికలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉండవెల్లి మండల కేంద్రంలో సంపత్ కుమార్ తనయుడు దీపక్ ప్రజ్ఞ ప్రచారం నిర్వహించారు.

మానవపాడు: మండలంలోని చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, చెన్నిపాడు గ్రామాల్లో బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రసన్నకుమార్ ప్రచారం నిర్వహించారు.

న్యాయ పోరాటం చేస్తాం

అలంపూర్: బీఆర్ఎస్ అభ్యర్థిపై న్యాయ పోరాటం చేస్తామని బీఎస్పీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రసన్న కుమార్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడు నామినేషన్‌లో తప్పులు తడకగా ఉందని రిటర్నింగ్ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు.

పోటాపోటీగా..

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం పోటాపోటీగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో ప్రజాప్రతినిధులు, నాయకులు గడప గడపకు తిరిగి ప్రచారం చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం

అలంపూర్/ఎర్రవల్లిచౌరస్తా: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందనే విశ్వాసం తమకు ఉందని కర్ణాటక ఎమ్మెల్యే, ఏఐసీసీ నియోజకవర్గ అబ్జర్వర్ రఘుమూర్తి అన్నారు. అలంపూర్ పట్టణంలోని టూరిజం హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని సర్వేలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలో 80 సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందని సర్వేలు చెబుతుండగా అంత కంటే ఎక్కువ సీట్లు వస్తాయని మాకు నమ్మకం ఉందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఓట్లను దండుకోవడం కోసమే పనిగట్టుకొని కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేస్తున్నాయని తెలిపారు.

పారిశుద్ధ్యం లోపిస్తే ప్రమాదమే!

- దోమల బెడదతో విషజ్వరాలు
- పరిసరాల శుభ్రతపై అవగాహన లోపం
- ఫాగింగ్ చేపడితే కొంత ఉపశమనం

మానవపాడు: వర్షాకాలం పూర్తి కావడంతో దోమలు స్వైరవిహారం మొదలుపెట్టాయి. దోమల వల్ల డెంగీ, మలేరియా వంటి ప్రమాదకరమైన జ్వరాలు విజృంభించే అవకాశముంది. పారిశుద్ధ్యం లోపిస్తే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటికే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల కేసులు అక్కడక్కడ నమోదవుతున్నాయి. చికెన్‌గున్యా వంటి వైరల్ వ్యాధులు క్యాకడుతుంటాయి. నీరు కలుషితమైతే డయేరియా వ్యాపించే ప్రమాదముంది. నిత్యం అప్రమత్తంగా ఉండాలని, పారిశద్ధ్య చర్యలు తీసుకోవాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సి ఉంది. ప్రతి మంగళ, శుక్రవారాల్లో గ్రామగ్రామానా పర్యటిస్తూ డ్రై డేలు పాటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.



జల్లాపురంలో రోడ్డుపై మురుగు

దోమకాటుతోనే విష జ్వరాలు..

ప్రధానంగా దోమకాటుతోనే జ్వరాలు వ్యాపిస్తుంటాయి. ఖాళీ ప్రదేశాలు, మురుగుగుంతలు, డ్రెయినేజీల్లో నిల్వ ఉండే నీటిలో పెరిగే దోమలు ఎంతో ప్రమాదకరమైనవి. క్షేత్రస్థాయిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వీటికి అవాసాలు ఉండవు. దీంతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉండదు. దోమకాటుతో విషజ్వరాలు రాకుండా గ్రామాల్లో శుభ్రంగా ఉంచడంలో గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారు. గ్రామాల్లో నీటిని నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకుంటే విషజ్వరాలు తగ్గుతాయి.



గృహాల మధ్యన బావి చుట్టూ చెత్తచెదారం

రోడ్లపై మురుగు..

గ్రామాల్లో రోడ్లపై మురుగు, చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. తడి, పొడి చెత్తల నిల్వలు ఉండటంతో కుళ్లిన మురుగు, చెత్తచెదారాలతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిల్వ ఉండటం, రోడ్లపై మురుగు పెరుకుపోవడం, మురుగుకాల్వల్లో వ్యర్థాలను వేయడంతో కాలనీలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. దీని వల్ల పిచ్చి మొక్కలు పెరిగి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. వీటి వల్ల విషజ్వరాలు సోకే ప్రమాదం ఉందని మండల ప్రజల వాపోతున్నారు.

పరిశుభ్రంగా ఉంచాలి



పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి. మురుగుకాల్వల్లో, ఇళ్ల చుట్టు పక్కల చెత్త ఉండడం వల్ల దోమల వ్యాప్తి చెందుతాయి. దీంతో జ్వరాలు సోకుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని గ్రామాల్లో పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలి.

– యుగంధర్, చెన్నిపాడు

ఫాగింగ్ చేయాలి



గ్రామాల్లో మురుగు, చెత్తచెదారం పేరుకుపోయినప్పుడు దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి. దీంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలి. ఖాళీ స్థలాల్లో నీటిని తొలగించి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– బజారన్న, మానవపాడు

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

మండలంలోని ఆయా గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. గ్రామాల్లో నివాస గృహాల్లో ఇళ్ల చుట్టు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. మురుగు నిల్వ ఉన్నచోట ఫాగింగ్‌కు చర్యలు తీసుకుంటాం.

– రమణరావు, ఎంపీడీఓ, మానవపాడు

కాంగ్రెస్, బీజేపీలకు ఓటేసి వృథా చేయొద్దు



బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల కార్యకర్తలతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కేటీదొడ్డి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటేసి వృథా చేయొద్దని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కోరారు. మండల పరిధిలోని మల్లాపురం, మల్లాపురంతండా, కుచినెర్ల, చింతలకుంట, నందిన్నె గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా గద్వాల నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, సీఎం కేసీఆర్ సారథ్యంలో దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, పటేల్ ప్రభాకర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్‌రామన్‌గౌడు, ఎంపీపీ విజయ్, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, సుమతి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాసు హనుమంతు, మండల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ఉరుకుందు ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిక

మల్దకల్ మండలంలోని మద్దెలబండ తండా, మల్లాపురం తండాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, వైస్‌ఎంపీపీ వీరన్న, నాయకులు ఉన్నారు.

వచ్చేది కారు, అభివృద్ధి చేసేది కేసీఆర్..

గట్టు: తెలంగాణలో మరోమారు అధికారంలోకి వచ్చేది కారు అని, అభివృద్ధి చేసేది కేసీఆర్ సారూ



జోకన్‌గట్టులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సల్కాపురం, జోకన్‌గట్టు, తారాపురం గ్రామాల్లో ఆయన ఎన్నిక ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ అందజేస్తుందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేవలం 3 గంటల కరెంట్ ఇస్తుందని, ఏది కావాలో రైతులు తేల్చుకోవాలన్నారు. తాగు, సాగు నీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కరించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని తెలిపారు. అధికారంలోకి రాగానే పింఛన్లతో పాటుగా 400కే గ్యాస్ సిలిండర్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి ఉచితంగా బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. మూడోసారి ముచ్చటగా సీఎంగా కేసీఆర్ అధికారం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, వైస్ ఎంపీపీ సుమతి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతు, బీఆర్ఎస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తుమ్మిళ్ల లిఫ్ట్ కేసీఆర్ పుణ్యమే



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

శాంతినగర్: ఆర్డీఎస్ రైతులను ఆదుకుంటున్న తుమ్మిళ్ల లిఫ్ట్ కేసీఆర్ పుణ్యమే అని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. వడ్డేపల్లి మండలంలోని తనగల, జూలెకల్, జక్కిరెడ్డిపల్లి, తిమ్మాజిపల్లి, రామాపురం గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజేయుడుతో కలిసి బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా తనగల, జూలెకల్ గ్రామాల్లో ఎమ్మెల్సీ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా పరిష్కారం కాని ఆర్డీఎస్ రైతుల సమస్యను సీఎం కేసీఆర్ తుమ్మిళ్ల లిఫ్ట్ మంజూరు చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. మల్లమ్మకుంట, వల్లూరు, జూలెకల్ రిజర్వాయర్ల నిర్మాణ బాధ్యతను తాను తీసుకుంటానని, కేసీఆర్‌తో మాట్లాడానన్నారు. ఏ డాదిలోపు చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి లింక్ కెనాల్ ద్వారా ఆర్డీఎస్‌కు నీరందించి ఆయకట్టు రైతులను ఆదుకుంటామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. ముఖ్యంగా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, వృద్ధాప్య పింఛన్లు రూ.3 వేల నుంచి ఐదు వేలకు పెంచుతామన్నారు. గ్యాస్ సిలిండర్ రూ. 400లకు అందజేసి మహిళలకు న్యాయం చేస్తామన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి విజేయుడు మాట్లాడుతూ కమీషన్ల పాలనకు స్వస్తి చెబుతామన్నారు. సంక్షేమ పథకాల మంజూరులో అందరికీ న్యాయం చేస్తామన్నారు. ఇంటింటా తిరుగుతూ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకు లు పుల్లూరు నాగేశ్వర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రవిరెడ్డి, లతీష్‌రెడ్డి, నాతనియేల్, రవికుమార్, శ్రీనివాస్‌గౌడ్, పచ్చర్ల శ్రీనివాసులు, విష్ణురెడ్డి, రాధకృష్ణారెడ్డి, జయరామిరెడ్డి, భార్గవ్‌యాదవ్, అమర్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

'నెట్టెంపాడు'ను సాధించిన వారికి అవకాశం ఇవ్వండి



మల్దకల్: గద్వాల నియోజకవర్గంలో నెట్టెంపాడు ప్రాజెక్టు లేకుంటే ఈ నడిగడ్డ ప్రాంతం ఎడారిగా మారేదని, రైతుల కష్టాలను తెలుసుకోని వారి అభివృద్ధి కోసం నెట్టెంపాడు ప్రాజెక్టును సాధించిన వారికి ఈ ప్రాంత ప్రజలు అవకాశం ఇవావ్వాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ కోరారు. బుధవారం గద్వాల బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి శివారెడ్డి తరపున మండలంలోని నేతువానిపల్లి, నేతువానిపల్లితండా, ఉలిగేపల్లి, దాసర్‌పల్లి, బిజ్వారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కుర్చీ కోసం కండువాలు మార్చుకునే నాయకుల మాటలు నమ్మొద్దన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల మోసాలకు ప్రజలు మోసపోవద్దని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే బంగారు తెలంగాణ కాలేదని, కేసీఆర్ కుటుంబం, ఆపార్టీ నాయకులకు మాత్రమే బంగారు తెలంగాణగా మారిందన్నారు. నరేంద్రమోడీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామాంజనేయులు, వెంకటేశ్వరరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రాముడు, నర్సింహులు, తిమ్మారెడ్డి, అశోక్, భీమ్లా నాయక్ పాల్గొన్నారు.

పాగుంట స్వామి సన్నిధిలో..

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన శ్రీపాగుంట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శేషిరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, నాయకులు హన్మిరెడ్డి, రాజేష్, నరసింహ, నల్లారెడ్డి, కృష్ణ, శ్రీపాదరెడ్డి, నాగి రెడ్డి, రాములు, ఎర్రభీంరెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న పర్వతరెడ్డి

గద్వాల అర్బన్: ఎస్టీయూటీఎస్ 76ఏళ్లుగా నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అభ్యాసన ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరై మాట్లాడారు. డీఏ, డీఆర్, పీఆర్సీ, సరెండర్, వైద్య బిల్లు, జీపీఎఫ్, క్లెయిమ్స్ తదితర పెండింగ్ బిల్లును తక్షణమే విడుదల చేయాలని, 317జీవోతో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపీఎస్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా యూనుస్ పాష, ప్రధాన కార్యదర్శి పులిపాటి లక్ష్మణ్, అదనపు ప్రధాన కార్యదర్శులుగా శంకర్ నాయక్, ఇస్మాయిల్, సంయుక్త కార్యదర్శులు సుదర్శన్, నయీం, విజయ్‌భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఓటుతోనే నడిగడ్డ మార్పు సాధ్యం

గద్వాల అర్బన్: అభివృద్ధికి నోచుకోని నడిగడ్డను ఓటుతో మార్పు తీసుకోద్దామని పలువురు విశ్రాంత ఉద్యోగులు, వివిధ పార్టీల నాయకులు అన్నారు. సీనియర్ సిటీజన్ ఫోరం మోహన్‌రావు అధ్యక్షతన బుధవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర రాజకీయ పదవుల్లో ఉన్న వారు గద్వాలలో విద్య, వైద్యం, పరిశ్రమలు, ఉపాధి, వ్యవసాయ తదితర రంగాలను అభివృద్ధి చేయలేదని అభిప్రాయపడ్డారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు భీంసేన్ రావు, అచ్చన్నగౌడ్, గోపాల్‌రావు, విశ్రాంత ఉద్యోగులు నర్సింహులు,



కరపత్రాలు విడుదల చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు, వివిధ పార్టీల నాయకులు

బాలరాజు, వసంతరాముడు, బీసీరెడ్డి, రామకృష్ణారెడ్డి, మైనార్టీ నాయకులు కౌసర్ బేగ్, జమాల్, రహిమతుల్లా ఉన్నారు.

వల్లూరులో ఓటుహక్కుపై అవగాహన



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని వల్లూరులో బుధవారం ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ రాఘవ హాజరై గ్రామస్తులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా మహిళా ఓటర్లు తమ ఓటును వేసి హక్కును ఉపయోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దిలీప్‌కుమార్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, మహిళా సంఘాలు, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన మంగళి రాజశేఖర్ అనారోగ్యంతో అకాల మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, పోతురాజు శంకరమ్మ సేవాదళం ట్రస్ట్ చైర్మన్ సోమనాద్రి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట వెంకటన్న, కృష్ణ, భద్ర, రాము, పరుశ, గట్టుబాబు, తిమ్మప్ప, సిరాజు, దేవన్న, లక్ష్మన్న, రామకృష్ణ ఉన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె, చింతలకుంట గ్రామాల్లోని బుధవారం సాయంత్రం సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ బలగాలు కవాతు నిర్వహించారు. ఎన్నికల కోడ్ నియమావళి, ఓటు ప్రాధాన్యతపై పోలీస్ కళాబృందం ఆయా గ్రామాల్లో తమ ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ నెల 30న జరుగబోయే శాసనసభ ఎన్నికలను గ్రామాల్లో ఫ్రీ అండ్ ఫేర్‌గా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎన్నికల కోడ్ ఉన్నందున గ్రామ ప్రజలు అందరు కోడ్ నియమావళిని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్, కేంద్ర బలగాలు,



చింతలకుంటలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర పోలీస్ బలగాలు

కళాబృందం సభ్యులు హెడ్ కానిస్టేబుల్ రాధమ్మ, హనుమంతు, కృష్ణ, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

హెలీప్యాడ్ స్థలం పరిశీలన

అయిజ: మండల కేంద్రంలో ఈనెల 17న బీ ఎస్పీ నాయకులు నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు సంబంధించి హెలీప్యాడ్‌ను బుధవారం బీఎస్పీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రజా ఆశీర్వాద సభకు హెలీకాప్టర్‌లో రాబోతున్నారని తెలిపారు.

డా.బాలకిష్టయ్య సేవలు చిరస్మరణీయం

వనపర్తి టౌన్: సైకిల్‌పై వనపర్తిలో ప్రజలకు వైద్య సేవలు అందించి, ఎందరో డాక్టర్లకు ఆదర్శంగా నిలిచిన డాక్టర్ బాలకృష్ణయ్య సేవలు మరువలేనివని ఆయన కుమారుడు డాక్టర్ భూపేష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలకృష్ణయ్య మెమోరియల్ ట్రస్ట్ భవనంలో 99వ జయంతిని ఘనంగా నిర్వహించారు.

కనులపండువగా బొడ్రాయి ఉత్సవాలు

అమరచింత: పట్టణంలో జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజల్లో భాగంగా బుధవారం బొడ్రాళ్లను గ్రామోత్సవం పేరిట పట్టణంలోని పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. తెల్లవారుజామున హోమం చేసిన తర్వాత బొడ్రాళ్లకు ధాన్యదివాసం నిర్వహించారు. పట్టణంలోని మహిళలు తమ తమ ఇళ్ల నుంచి బియ్యం తీసుకొచ్చి బొడ్రాళ్లపై వేసి పూజలు చేశారు. సాయంత్రం బొడ్రాళ్లను పట్టణ పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు. మంగళహారతులతో మహిళలు ఉత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. బొడ్డెమ్మలతో పాటు కోలాటం వేస్తూ ఊరేగింపు చేశారు. గురువారం బొడ్రాళ్ల ప్రతిష్ఠ పూజల అనంతరం ఆడపడుచులు వడిబియ్యం వేసుకోవాలని వేదపండితులు తెలిపారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

కార్యక్రమంలో వేదపండితులు భువనచంద్రచార్యులు, సాకేతా రామాచార్యులు, ప్రసాద్‌శర్మతో పాటు నిర్వాహకులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప మాలాదారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, శరణుగోష చేసి, అష్టోత్తరంతో భక్తి గీతాలపించారు. అనంతరం చిన్న తాండ్రపాడుకు చెందిన రామన్‌గౌడు అయ్యప్ప మాలాదారులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆంజనేయశర్మ, ధర్మకర్త దామోదర్‌రెడ్డి, గురు స్వాములు సూర్య కాంతారెడ్డి, రాముడు, నరసింహ, రాంబూపాల్ రెడ్డి, మధు, ఆంజి పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని తక్కశిల గ్రామానికి చెందిన ఆంజనేయులు పొలం విషయంలో అలంపూర్ కోర్టులో సివిల్ కేసు నమోదైంది. దీంతో ఆ గ్రామానికి చెందిన గొల్ల బజారి, సుధాకర్‌లు ఆంజనేయులుపై దారిలో దాడి చేశారు. ఇరువురు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు.

వైభవంగా పాగుంటస్వామి జాతర



స్వామివారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



జాతరకు వచ్చిన ప్రజలు

కేటీదొడ్డి: దీపావళి సందర్భంగా పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం మండలంలోని వెంకటాపురంలో పాగుంటస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని ఆలయం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు వాహనంపై పల్లకీసేవ నిర్వహించారు. సేవా కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.